

# ఆలపాటి రవీంద్రనాథ్ తో

(మిసిమి సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్ చౌదరిగారు గదిలో కొన్ని ప్రాచీన వస్తువుల్ని సర్దుతూ, మొక్కల్ని సరిచేస్తూ, చేతిలో పత్రికతో పచార్లు చేస్తూ వుంటారు. (ప్రవేశం మధురవాణి)

**మధుర** : కన్యాశుల్కం లోంచి నన్ను బయటకు లాగి నలుగురిలో పడేట్లు చేశారు. మీరూ, మీ స్నేహితుడూ.

**రవీంద్ర:** నిన్ను ఒక వేశ్యగాకాక పెద్ద పండితురాలిని చేశాము గదా!

**మధుర:** నాకేం ఒరిగింది? మీ కోరిక తీరింది తప్ప.

**రవీంద్ర:** మధురవాణి ఒక చతురవాణిగానే కాక మేధావి గావటం నీకిష్టంలేదా!

**మధుర:** లోపల సంతోషమే మీ చిలిపితనానికి. చాలామందిని నా చేత అల్లరి పెట్టించి మీరు ఆనందించినట్లున్నారు.

**రవీంద్ర:** కాదు, గర్వించాను; 'మిసిమి' స్థాయి నీవల్ల పెరిగినందుకు.

**మధుర:** దీనివల్ల మీరే తగువులు పడతారో?

**రవీంద్ర:** అవన్నీ శర్మగారివి కీర్తి 'మిసిమి'ది

**మధుర:** తడిక తోసినవాడిది తగూ అని. దెబ్బలు మంచానికి.

**రవీంద్ర:** శీర్షికా నిర్వహణం ఒక ముళ్ళ కిరీటం.

**మధుర:** జీవితం ఒక శిలువ, ప్రతివాడూ ఒక క్రీస్తు అని అన్నాడో ఆధునిక కవి

**రవీంద్ర:** చూశావా, నువ్వు కూడా కవిత్వాలు వల్లిస్తున్నావు. అంతా 'మిసిమి' మహిమ

**మధుర:** కన్యాశుల్కం లోంచి నన్నుబయటకు లాగి మాట్లాడించాలని మీకెలా తట్టింది?

**రవీంద్ర:** అది అసలు గురజాడ వారి అయిడియా. ఆయనెక్కడో ఒక ఇటాలియన్ పుస్తకంలో చూశాట్ట

**మధుర:** ఏమిటి ఆయన చూసింది?

**రవీంద్ర:** ఒక వేశ్య చేత ఆకాలంలోని సమకాలీన మహానుభావుల్ని ఊహాజనితంగా ఇంటర్వ్యూ చేయించి ప్రకటించాలని ఆ ఇటాలియన్ కర్త కోరిక గురజాడ వారు గమనించి అలాటిదేదో చేయాలనుకున్నారు.

**మధుర:** అటు తిరిగి ఇటు తిరిగి, ఆ కోరిక తీర్చడానికి మీరూ మీ స్నేహితుడూ నడుం కట్టారన్నమాట.

**రవీంద్ర:** మేం ఆ అయిడియా మీద పనిచేశాం గాని గురజాడ వారి ముందు మేవెంత?

**మధుర:** నృత్య సంగీతాల్లో పడికొట్టుకునే మమ్మల్ని సాహిత్య మేధావుల ప్రపంచంలోకి లాగారు. నక్క ఎక్కడ? నాగలోకమెక్కడ?

**రవీంద్ర:** సంభాషణా చాతుర్యం అంటే నీదే.

**మధుర:** చమత్కారానికి కాదు, మాధుర్యానికి నాకా ప్రసిద్ధి

**రవీంద్ర:** మనపూర్వ సాహిత్యంలో విప్రనారాయణుడు మోహించిన వేశ్య దేవదేవి; ఆవిడ అక్కగారు మధురవాణి వసంతసేనను చూసి గురువుగారు నిన్ను దిద్దారు కాబోలు.

**మధుర:** ఆవిడకు చారుదత్తుడు దొరికితే నేను గిరీశం గారి పాలబడ్డాను. తర్వాత రామప్పపంతులు. సరే పేకాటలో అంతా.

**రవీంద్ర:** నీతో పేకాడిన వారు ధన్యులు.

**మధుర:** రామప్పపంతులు కమాను మీద వెళ్ళినపుడు మరి నాకు కాలక్షేపం కావడమెల్లాగ?

**రవీంద్ర:** నీ కాలక్షేపానికే కదా ఇంతమందితో ఈ కబుర్లు !

**మధుర:** ఏమి చమత్కారమండీ? మీ గర్ల్ ఫ్రెండ్ కోసం మీరు చేసినవన్నీ నా కోసం అంటారే?

**రవీంద్ర:** 'మిసిమి' నా గర్ల్ ఫ్రెండని నీకెల్లా తెలిసింది.

**మధుర:** సానివాళ్ళకు కర్ణపిశాచి వుంటుంది.

**రవీంద్ర:** విజయనగరంలో ఆనందగజపతి మహారాజు కాలంలో మద్దెల మహాలక్ష్మి అనే వేశ్యా రత్నం వుండేదట. ఆవిడ మహా గొప్ప సంగీత విద్వాంసురాలు. ఆవిడ అలవోకగా ఒక రాగం విసిరితే విని పట్టుకుందామని నారాయణదాసు గారిలాంటి హరికథా పితామహులు చూసేవారట. గురజాడ వారికి అవిడ నీ పాత్రకి ప్రేరణ అంటారు పెద్దలు.

**మధుర:** మొట్టమొదటి కన్యాశుల్కంలో నేనున్నానండోయ్.

**రవీంద్ర:** కాని అందులో నీ రూపం 'కలర్‌లేస్ ఇన్‌క్విటీ' అన్నారు గురజాడ.

**మధుర:** రెండోకన్యాశుల్కంలో నన్ను ఎంతగా పెంచారంటే మాగురువుగారు.. (సిగ్గుపడును)

**రవీంద్ర:** నిన్ను మోహించేటంత! దాపరికం అక్కర్లేదు, అప్పారావుగారుముని సుబ్రహ్మణ్యం గారికి రాసిన ఉత్తరంలో I am enamoured of her అన్నారు. కవి తన సృష్టిని తానే మోహించడం అపూర్వం నిన్ను మోహించకుండా ఎవరుండగలరు? (నవ్వు)

**మధుర:** ఆపండి "You too, Brutus?" అన్నట్టు మీరుకూడానా ? (అలక)

**రవీంద్ర:** 'మిసిమి' నువ్వు చదివావా?

**మధుర:** నిజం చెప్పమంటారా, అబద్ధం చెప్పమంటారా?

**రవీంద్ర:** నిజం ఎవరిక్కావాలి? అబద్ధమే చెప్పు. (ముసి ముసి నవ్వు)

**మధుర:** ఆ వ్యాసాలు మీకు మట్టుకు అర్థం అవుతాయా? నిజం చెప్పాలి.

**రవీంద్ర:** అలా ఎందుకనుకున్నావు?

**మధుర:** ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క భాషలో రాస్తారు పెద్దపెద్ద విషయాలు, అవి అర్థమై చావవు ఓ పట్టాన.

**రవీంద్ర:** అటువంటి విషయాలు, సంగతులు వున్నాయని కనీసం మనవాళ్ళకు తెలియచెప్పటం మిసిమి డ్యూటీ. మచ్చుకి అంబేద్కర్‌ని ప్రేరేపించినది ఒక తెలుగు వాడి పుస్తకమని మేం బైట పెట్టామా లేదా?

**మధుర:** అలాగే వీరేశలింగంగారిని ఉత్సాహపరిచింది సామిధేని ముద్దుకృష్ణమనాయుడని తెలిసిందీ 'మిసిమి' వల్ల నే కదా!

**రవీంద్ర:** దొంగా, దొరికావు! నువ్వు చదువుతావు 'మిసిమి'ని. అర్థంకాదని పైకి దొంగ కబుర్లు చెబుతావు తెలివిగా.

**మధుర:** మీ పత్రికలో చాలా వ్యాసాలు కుప్పు సామయ్యరు మేడ్ డిఫికల్టు, అవునా, కాదా?

**రవీంద్ర:** ఆ విషయాలు అలాటివి. శాస్త్ర విషయాలు సులభంగా పకోడీల్లా ఎలా వుంటాయి?

**మధుర:** అయితే మీ 'మిసిమి'కి స్త్రీలు పాఠకులు కాలేరు.

**రవీంద్ర:** తెలుగు వారు ఎప్పుడూ ఎదగకుండా చచ్చు కథలూ, పుచ్చునవల్లూ, పిచ్చి కవితలూ చదువుకుంటూ స్థిరోభవ వరదోభవ అని అల్లాగే వుండాలనా? మిసిమి చదివిన కొందరు స్త్రీలు నువ్వేమీ అనుకోనంటే 'విదుషీ మణులు' అంటాను - తోటి స్త్రీలకి చెబుతున్నారు. కొందరైతే వ్యాసాలు పంపేరు కూడా ముదితల్ చదవగలేని పత్రిక కలదే? - అనొచ్చు.

**మధుర:** తెలుగువాళ్ళకి ఓ పట్టాన అర్థం కాని పత్రిక నిర్వహించినందుకే మీకు ఆ అమెరికా వాళ్ళేదో పురస్కారం ఇచ్చారట - డాక్టరేటు

**రవీంద్ర:** నీ వేళాకోళానికేం గాని, ఒకళ్ళు మెచ్చి మేకతోలు కప్పుతారనీ, ఒకళ్ళు తెగడుతారనీ నేను 'మిసిమి'ని నడపలేదే? నా ఆనందం కోసం, నా తృప్తి కోసం. నేను ఖాళీగా వుండకుండా ఏదో ఒకటి చెయ్యాలి కదా!

**మధుర:** మీ తాలుకా వారంతా సినిమాలు తీశారుగా. మీరూ ఓ సినిమా తీసి వుండాల్సింది. తెలుగువారికి సినిమా పిచ్చి తప్ప మరేమీ లేదు.

**రవీంద్ర:** సినిమాలు నా ఒంటికి పడవు. అయినా నన్ను ఆటపట్టించడానికి కాకపోతే నీవా ప్రశ్న నన్ను అడగడానికి నేను నీకంటికి అలా కనిపిస్తున్నానా? జీవితం గంభీరమైనది. కాలం అంతకన్నా విలువైనది కదా!

**మధుర:** అన్నట్లు ఓ మాట అంటాను కోపం తెచ్చుకోరు గదా!

**రవీంద్ర:** కోపం దేనికి? అందునా నీ మీదా ?

**మధుర:** మీరు మిసిమి బంగరు రంగులోవున్నారు. మీ బాడీ కలర్‌కి సూటవుతుందని 'మిసిమి' అని పేరెట్టారేమోనని మీ పత్రిక్కి.

**రవీంద్ర:** 'ఫెమినైన్స్ ఆర్‌ఫూల్స్' అన్నాడు గిరీశం.

**మధుర:** ఆరోజుల్లో ధనికొండ హనుమంతరావు నడిపిన 'రేరాణి' పత్రిక వెనక మీరేనటగా సారథ్యం?

**రవీంద్ర:** అందుకనేగా, ఒక మారు మేజిస్ట్రేటు కోర్టులో శిక్ష కూడా పడింది నాకు. ఫైన్ వేశారు.

**మధుర:** తెలుగు జర్నలిజంలో మేగజైన్ జర్నలిజానికి పునాదులు వేసిన వారిలో మీరొకరను కుంటా. అవునా?

**రవీంద్ర:** 'జ్యోతి' నడిపినా ఆ వెనక 'రేరాణి' నడిపినా నా ఒరవడి నాదే సంచలనం రేపితే భావజడత్వం బద్దలయి తీరుతుంది.

**మధుర:** మీరు రాయిస్టులనుకుంటా. ఆమ్లెట్లు వేయాలంటే గుడ్లు బద్దలు కొట్టాల్సిందే శ్రీశ్రీ చెప్పినట్లు.

**రవీంద్ర:** ఫ్యామిలీ ప్లానింగ్, జనాభా సమస్య మీద వ్యాసం వేస్తే నార్లవంటివారు ఇది ఎందుకు వేశారు అని అభ్యంతరం చెప్పారు.

**మధుర:** ఎన్.టి. ఆర్.గారు ఫ్యామిలీ ప్లానింగ్ ఉపన్యాసాలు చెబితే బాగుండదు కదా!

**రవీంద్ర:** వారి కుటుంబ సమస్యలే రాష్ట్ర జీవన్మరణ సమస్యలయాయి. రాజకీయాలు మనకెందుకు గాని నేను అందరు తత్వవేత్తల్ని ఆకళింపు చేసుకున్నా. అబ్బూరి రామకృష్ణారావు గారు, చలం అంతా రాయిస్టు వాసన చూసినవాళ్ళమే.

**మధుర:** మీరేదన్నా 'నో' అంటే, చౌదరి గారు నో అన్నారు ఏముందోనని రచయితలు పునరాలోచన చేసే స్థితి వుంది.

**రవీంద్ర:** మరి ఇప్పటిలా కాక ఎడిటర్ ఎవరికీ తల వంచకూడదు. పోతన గారిలా 'ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి ..!'

**మధుర:** బౌద్ధం పట్ల మీకు ఆసక్తి హెచ్చనుకుంటా.

**రవీంద్ర:** ''బౌద్ధమతాన్ని తన సరిహద్దుల నుంచి తరిమేసి ఇండియా ఆత్మహత్య చేసుకుంది'' అన్నారు గురజాడ.

**మధుర:** వీరేశలింగం, నాయుడుగారు, కృష్ణశాస్త్రి ఇలా అంతా హిందూ వైదికమతం నుంచి దూరమైన వారే. మిమ్మల్నీ మీ తపసనీ తెలుగువారు గుర్తించలేరు కదా!

**రవీంద్ర:** నేను సైలెంట్ వర్కర్ని. ఆరోక్లాసు దాకా మాత్రమే చదువుకున్నవాడ్ని నాకు పుష్పగుచ్ఛాలు అక్కర్లేదు. పన్నీటి జల్లులూ అవసరం లేదు

**మధుర:** అవును, సూర్యచంద్రుల్ని ఎవరు గుర్తించాలి.

**రవీంద్ర:** నన్ను ములగచెట్టు ఎక్కించకు నేను మామూలు మనిషిని ప్లీజ్!

**మధుర:** మామూలు మనిషీ జిందాబాద్! పునర్జన్మ లేదన్న 'మిసిమి' జిందాబాద్.

అసతోమాసద్గమయ, తమ సోమా మిసిమిర్గమయ. ★

*(సుప్రభాతం 20 మార్చి 1996)*